క్లుప్తంగా

రేపటి నుంచి పోచమ్మ జాతర

తాండూరు రూరల్: చెంగోల్ గ్రామంలో సోమవారం నుంచి పొచమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచు మల్లీశ్వరిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9న కిషోర్ పంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, జల్ది కార్యక్రమంతో పాటు అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఊరడమ్మకు బోనాలు, మంగళవారం అభిషేకం, అనంతరం బోనాల ఉత్సవాలు ఉంటాయని సర్పంచు తెలిపారు. ఈ ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొడంగల్ రూరల్: కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 68మంది లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ బుచ్చయ్య చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరుకానున్నారని, మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు రావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

బంట్వారం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 9న ఉదయం 11గంటలకు జరుగనుందని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

దౌల్తాబాద్: తెలంగాణ వికలాంగుల వేదిక మండల అధ్యక్షుడిగా మండలంలోని ర్యాలగుట్టతండాకు చెందిన నరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ వికలాంగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

నవాబుపేట: మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలోని మైసమ్మ ఆలయ, విగ్రహ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం అమ్మవారికి అలంకరణ, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, పూల మొక్కలు నాటండి


నర్సరీలో పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

దోమ: నర్సరీలో పండ్లు, పూల మొక్కలతో పాటు ప్రజలకు అవసరమైన మొక్కలను నాటాలని సర్పంచ్ రాజిరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన సందర్శించి ఉపాధిహామి కూలీలు చేస్తున్న పనులను పరిశీలించి మాట్లాడారు. వచ్చే జూన్ నాటికి హరితహారంలో నాటే మొక్కలను పెంపకానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువైందని, వాటి నుంచి మొక్కలను రక్షించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు మొక్కలకు నీరు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

కుల్కచర్ల: పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు మాసయ్య అనారోగ్య సమస్యతో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు శనివారం మాసయ్యను పరామర్శించి మాట్లాడారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినా భయాందోళన చెందాల్సిన అవసరంలేదని, తాము నిరంతరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భరోసా ఇవ్వని 'భగీరథ'

నీటి సరఫరాపై నీలినీడలు!

- ఏ సమస్య తలెత్తినా పల్లెల్లో తాగునీటి కటకట
- ప్రత్యామ్నాయం లేక.. జనం అవస్థలు
- మూలనపడ్డ చేతిపంపులు, బోరుమోటార్లు


ఎల్ఎన్‌తండాలో పనిచేయని బోరువావి

ధారూరు: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై నీలినీడలు కమ్ముకున్నాయి. పైపులైన్‌కు ఎక్కడ ఏ చిన్న సమస్యతలెత్తినా సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సమస్య తీవ్రతను బట్టి మరమ్మతులు పూర్తయి.. సరఫరా పునరావృతం అయేసరికి వారం పదిరోజులు సమయం పడుతోందని బాధిత గ్రామాల ప్రజలు వాపోతుండగా.. ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ మార్గంలేక ప్రజల మధ్య తిరగలేక పోతున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు వాపోవడం గమనార్హం. జిల్లాలోని పరిగి నుంచి తాగునీటి సరఫరా జరగడం, మధ్యలో ప్రధాన పైప్‌లైన్లు లీకేజీ అయినా.. పగిలిపోయినా పలు ప్రాంతాల ప్రజలు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

మరుగున పడిన చేతిపంపులు

మిషన్ భగీరథ నీటి సరఫరాతో.. ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా ఆగిపోయింది. హ్యాండ్‌బోర్లు, బోరు మోటార్లు వాడకపోవడం వలన మోటారుల తుప్పుపట్టిపోగా.. బోరుబావులు పూడుకుపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీటిపై ఆధారపడాల్సి వస్తోంది. ఇంత వరకు భాగానే ఉన్నా.. భగీరథ నీటి సరఫరాలో ఏ మాత్రం అంతరాయం ఏర్పడినా.. ఇప్పుడు పల్లె ప్రాంతాల్లో తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడుతోంది. ఊరుకు సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తీసుకువస్తూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, చేతిపంపులు, బోరుమోటార్లు సైతం మరుగున పడడంతో మరోదారి లేక ప్రజలే కాదు.. స్థానిక పాలకులు సైతం తలపట్టుకొంటున్నారు. రానున్న వేసవిలో ఇలాంటి పరిస్థితి ఏర్పడితే తమ గతేం కావాలనీ ప్రజలు ప్రశ్నిస్తుండడంతో.. ఏం చెప్పాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

'గురు'తర బాధ్యత మీదే

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి: ఎంపీపీ వసంత

మోమిన్‌పేట: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంపీపీ వసంత వెంకట్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్ద పీటవేస్తుందని, ఇప్పటికే పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కొరకు మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా రూ.కోట్లు వెచ్చిస్తుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు అంగేరి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఇఓ గోపాల్, జిల్లా టీయూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి దేవ్యానాయక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రేద్యా, శ్రీనివాసులు, సభ్యులు కిషోర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటచారి, నీలాంబిక, శమంత, యాదమ్మ, నాజీయబెగం, నస్మ, విజయ, సంధ్య, నాగజ్యోతి, మల్లమ్మ, అస్మాబెగం, సిఆర్‌పిలు బుచ్చయ్య, శ్రీనివాస్, పద్మరావు తదితరులు ఉన్నారు.



టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

దళితులపై దాడులను అరికట్టాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫోన్లు, వాట్సాప్ మెసేజీల ద్వారా.. బెదిరిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామికవాదులు, అంబేడ్కర్ వాదులపై భౌతిక దాడులను అరటికట్టాలని తహసీల్దార్లకు వినతిపత్రం అందజేస్తూ.. ప్రభుత్వం దృషికి తీసుకెళ్లేలా కృషిచేయాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ బాబు, పట్టణ అధ్యక్షుడు జగన్మోహన్, ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, బీసీ సంఘం జిల్లా నాయకుడు భీమరాజ్, ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ దస్తప్ప, కెఎన్‌పీఎస్ నాయకులు కొత్తురు లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ బహూకరణ

మర్పల్లి: విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఆర్‌ఓ వాటర్ (మినరల్) ప్లాంట్‌ను పాఠశాలకు ఉచితంగా అందజేసినట్లు హైదరాబాద్ యూత్ అసెంబ్లీ స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజంలో తనకు తోచిన విధంగా సేవే చేసేందుకు సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ బడిలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీశైలం మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి విద్యాసాగర్, ఆ సంస్థ డైరక్టర్ కార్తిక్, కోశాధికారి మిథిన్, లాజిస్టిక్ సభ్యుడు ఇస్మాయిల్, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట.. పెంటపాలే!

- కూరగాయల సాగుపై కర్షకుల నిట్టూర్పు
- పెట్టుబడి దక్కక.. పశువులకు మేతగా
- కన్నీరుపెట్టిస్తున్న టమాట


కూరగాయ పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెద్దేముల్: కూరగాయల సాగు రైతులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. అమ్మబోతే అడివిలాగా తయారైంది. పండించినంత వరకు ఉండే ఆనందం.. తీరా పంట మార్కెట్‌కు తరలించగా.. కనీసం పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని, చివరకు పంట పెంటపాలే అవుతోందని వాపోవడం గమనార్హం. రకరకాల తెగుళ్లు సోకడం, కాయతొలిచే పురుగు, రసం పీల్చే పురుగు ఎగబడడంతో దిగుబడి కాస్త కరిగి.. రైతును కుంగదీస్తోంది. ఇంతచేసి దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తే.. మద్దతుధర లేక చివరకు పెంటపాలు చేయాల్సిన దుస్థితి నెలకొందంటూ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

'మద్దతు' పలికేవారు లేరు..

భారీ వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులు.. ఎక్కువగా కూరగాయల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. పంటకు పంట, రోజువారిగా ఆదాయం సమకూరుతుందనే ఆశతో వ్యవసాయ బోరుల వద్ద కూరగాయ పంటలను పండిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆ సాగుకూడా ఇప్పుడు వారికి ప్రతికూలంగా మారింది. తీరా పంటలు చేతికి వచ్చే సమాయానికి గిట్టుబాటు ధర దక్కక పోవటం, పంటకు తెగుళ్లు సోకడంలాంటివి వారిని కృంగదీస్తోంది. టమాట తదితర పంటలకు తెగుళ్లు సోకడంతో రైతులు లబోదిబోమంటున్నారు. లాభాలు కాదు కదా.. పెట్టుబడన్నా వస్తే చాలన్నట్లుగా చూస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని బుద్ధారం, గోట్లపల్లి, ఇందూరు, హన్మాపూర్, పెద్దేముల్, గాజీపూర్, తింసాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు కురగాయ పంటలను అధికంగా సాగుచేశారు. ప్రస్తుతం 24కిలో టమాట పెట్టె ధర రూ.80 నుంచి రూ.100 పలకడంతో ఏమిచేయాలో పాలుపోక దిగాలు పడిపోయారు. వంకాయ, బీరకాయ, చిక్కుడుతో పాటు వివిధ రకాల కూర గాయలను రైతులు అధికంగా సాగుచేశారు. 25 కిలోల టమాట బాక్స్‌ను తాండూరు మార్కెట్‌కు తీసుకెళితే ఖర్చు పోను రూ.50 మిగులుతున్నాయని, దీంతో పెట్టిన పెట్టుబడులకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని పెద్దేముల్ రైతు గురువప్ప ఆందోళన చెందుతున్నారు. కనీసం రూ.300 నుంచి రూ.5వేల వరకు ధర పలికితే.. కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని చెబుతున్నారు. ఆరు నెలల క్రితం కిలో టమాట రూ.50నుంచి రూ.60 పలకడంతో రైతులు టమాటను ఆసక్తిగా సాగుచేశారు. ప్రస్తుతం రూ.10కి పడిపోవడంతో ఏమి చేయాలంటూ ప్రశ్నిస్తున్నారు. ఏ పంటలు సాగుచేసినా.. తమకు మద్దతు ధర దక్కడం లేదని, అసలు మద్దతు ధరకు మద్దతు తెలిపేవారంటూ లేరని ఆవేదన చెందుతున్నారు.

బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ


పరిగి: పార్టీలో చేరిన మిట్టకోడూర్ యువకులు


వికారాబాద్‌లో..

బూత్ కమిటీ సమ్మేళనంలో కమలనాథులు

పరిగి: నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ నియోజకవర్గ ప్రభారి నరసింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఏబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించడంలో కార్యరక్తలదే కీలక పాత్ర అన్నారు. అంతే కాకుండా కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యలను తీర్చి బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ పార్టీ బీజేపి అని తెలియజెప్పాలని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ జనమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు పలువురు భాజపా చేరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్యగౌడ్, నియోజకవర్గ నాయకులు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, పెంటయ్య, హరికృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, ఏవి రాములు, శ్రీనివాస్ ఆయ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

వికారాబాద్ అర్బన్: రానున్న ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ సహ ప్రభారి అరవింద్ మీనన్ అన్నారు. పట్టణంలోని గౌలికర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో వర్చువల్‌గా జేపీ నడ్డ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అరవింద్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, జీవితరాజశేఖర్, నియోజకవర్గ ప్రభారి విద్యాసాగర్ రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

దౌల్తాబాద్: పీఆర్‌టీయూటీఎస్ నూతన క్యాలెండర్‌ను శనివారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు బెస్తభీమప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ బలపర్చిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌కుమార్, డీటీ చాంద్ పాష, ప్రధానకార్యదర్శి పెంట్యానాయక్, గౌరవ అధ్యక్షుడు భీంరెడ్డి పాల్గొన్నారు.

పదిలో ఫస్టుండాలి..

ధారూరు: విద్యార్థులకు పాఠ్యంశాలు బోధించడంలో ఉపధ్యాయులు శ్రమించాల్సి ఉంటుందని ఎంపీపీ విజయలక్ష్మి, జిల్లా వాలిబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు టీఎస్‌పీఆర్‌టీయూ 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సారి 10వ తరగతి ఫలితాల్లో మండలం ముందుండాలని సూచించారు. సంఘం నాయకులు మల్లికార్జున్, మాణిక్యం, శ్రీనివాస్, వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, దేవియా, యాదగిరి, సుదర్శన్, హీరామన్, జలీల్, అంజిలయ్య, సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.


దౌల్తాబాద్: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలి

కుల్కచర్ల: పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామ ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు మురుగుకాల్వలను పరిశీలించి మాట్లాడారు. గ్రామస్తులు తమ ఇళ్లలోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా.. జీపీ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించారు. చెత్తను మురుగుకాలువల్లో వేయడం వలన.. అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా మోరీలపై కొందరు ఇళ్లు, ప్రహరీలు నిర్మిస్తున్నారని, అలాంటి వారికి నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మురుగుకాల్వలను పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

స్వయం పరిపాలన దినోత్సవం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి.. తరగతి గదిలో పాఠాలు చెప్పారు. వీరి బోధనాపద్ధతులను గమనించిన ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీరేశం, కవిత, ఆనంద్‌కుమార్, నస్రీసుల్తానా, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


స్వయం పరిపాలనలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉపాధ్యాయ ఉద్యమాలు టీయూటీఎఫ్‌కే సాధ్యం

బొంరాస్‌పేట: ఉపాధ్యాయ ఉద్యమాలు టీయూటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చౌదర్‌పల్లి, బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యతగా ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ గోపాల్, రాష్ట్ర కార్యదర్శి జాంప్లా, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ తదితరులున్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి


బోరును ప్రారంభిస్తున్న నాయకులు

పూడూరు: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో తాగునీటి కోసం నూతనంగా బోరు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అవసరం ఉన్న చోట డ్రైనేజీ కాలువలతో పాటు సీసీ రోడ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉపాధ్యాయుడిగా ఎదిగి..

గురువుకు పూర్వ విద్యార్థి పాదాభివందనం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థి దశలో క్రమశిక్షణతో ఎదిగి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుడి పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాములు అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి ఉపాధ్యాయుడిగా విద్యాబుద్ధులు నేర్పిస్తూ పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగం చేస్తున్న రాములు తన గురువుకు సన్మాన సభను నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్పట్లో తెలుగు పండితుడిగా ఉపాధ్యాయుడు పెంటయ్య విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. నాటి క్రమశిక్షణ, విద్యాబుద్ధులే ఆ పాఠశాలలో చదివిన విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుడిగా అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండితుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయుడు పెంటయ్యను సన్మానించి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు నేర్పించే విద్యాబుద్ధులు ఎంతో మంచివని, క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మానాయక్, శోభారాణి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ భవన్‌కు స్థలం కేటాయించండి

షాద్‌నగర్: పట్టణంలో ముదిరాజ్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ.. శనివారం ముదిరాజ్ మహాసభ తాలుక అధ్యక్షుడు అంచరాములుతో పాటుగా పలువురు నాయకులు ఎమ్మెల్సీ బండ ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు వెంకటేశ్, అంతయ్య, శంకర్, శ్రీశైలం, యాదగిరి, మధు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్ మున్సిపాలిటీ ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం మున్సిపాలిటీ కన్వీనర్‌గా శ్రీధర్, కోకన్వీనర్‌గా చెవుల రవి, యువజన విభాగం కన్వీనర్‌లుగా భాస్కర్, హరీశ్, అలాగే వివిధ వార్డు కమిటీలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నర్సింహ్మా, శ్రీశైలం, వెంకటేశ్, జంగయ్య, శివ, యాదయ్య, రమేష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.